క్లుప్తంగా

అయ్యప్పస్వామికి అభిషేక పూజలు



నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహానికి ఉత్తరా నక్షత్రం జన్మదిన వేడుక అభిషేకాలతో పడి పూజ మహోత్సవం సోమవారం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి అభిషేక పూజలు చేశారు. ఉత్తరా నక్షత్ర పడిపూజ ప్రాంగణంలో ఆలయానికి ఫ్లోరింగ్ గ్రానైట్ బహూకరించిన నూకల స్రవంతి సురేశ్ కుటుంబీకులు అభిషేకం చేశారు. అనంతరం మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైపా సురేశ్, కోశాధికారి దొడ్డ రవీందర్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, ఇరుకుల్ల వీరలింగం, భూపతి లక్ష్మీనారాయణ, శింగిరికొండ వేణుగోపాల్, నూకల కొమురమ్మ, మణిదీప్, సిద్ధార్థ, రవీందర్, సునీత, అభిరామ్, వశీకర్, పాలకుర్తి శ్రీనివాస్, మిడిదొడ్డి బాబురావు, దొడ్డ వేణు, మల్యాల రాజు, శ్రీరామ్ కిరణ్, మల్యాల ప్రవీణ్, మాలే రవి, తదితరులు పాల్గొన్నారు.

మకర తోరణం బహూకరణ



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని పెద్దమ్మ తల్లి ఆలయానికి గ్రామానికి చెందిన బోళ్ల సరోజన కొమ్మాలు దంపతుల కుమారుడు రవి మానస దంపతులు సోమవారం రూ.35 వేల విలువైన మకర తోరణం బహూకరించారు. మకర తోరణాన్ని పెద్దమ్మ తల్లి విగ్రహానికి ఆలయ అర్చకుడు రమేశ్‌మూర్తి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారి రాజేందర్, కార్యదర్శి బోళ్ల రమేశ్, సభ్యులు వనవాసం సాంబయ్య, బండారి రాము, జటబోయిన నరేందర్, సొసైటీ అధ్యక్షుడు ఓరుగంట కుమారస్వామి, డైరెక్టర్ ఓరుగంటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఫార్మసీ కళాశాలలో సోమవారం జాతీయ ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఫార్మా విద్యార్థులు, అధ్యాపకులు నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులపై అవగాహన కలిగించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసూటికల్ సైన్స్ (బిప్స్) కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పుట్ట రవి, కవిత, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడండి



దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలో తమ శ్మశానవాటికను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ ఆ గ్రామ దళితులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 662లోని శ్మశానవాటిక భూమిని కొందరు సాదాబైనామాతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తప్పుడు రికార్డులు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, శ్మశానవాటికను అధికారిక రికార్డుల్లో నమోదు చేసి ఎవరికి కూడా దానిపై హక్కులు లేకుండా చూడాలని కోరారు.

ప్రభుత్వ భూమిని..

సంగెం : మండలంలోని నార్లవాయిలోని ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు డీఆర్‌ఓ విజయలక్ష్మికి సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం సమస్యను వివరించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఉన్న సర్వే నంబర్ 58/1లోని ఎకరం గ్రామ కంఠం భూమిని దామెర సుదర్శన్ అనే వ్యక్తి అక్రమించుకున్నాడని తెలిపారు. అలాగే గ్రామ శివారులోని రాళ్లకుంట చెరువుతోపాటుగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు నమిండ్ల రాజు, మొలుగూరి సూరయ్య, దామెర నరేందర్, తాళ్లపల్లి రాజమౌళి, బాబు, మొలుగూరి శ్రీనివాస్, కోడూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి శ్రీకారం

● మెరుగులు దిద్దుకుంటున్న పాకాల

ఖానాపురం : ఉమ్మడి వరంగల్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పాకాల ఒకటి. అయినా అభివృద్ధికి నోచుకోవడంలో వెనకబడిపోయిందన్న అపవాదు తెలిసిందే. ఇటీవల ఫారెస్ట్ శాఖ అధికారులు పాకాలలో పర్యాటక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పలు పనులు చేపట్టగా మరిన్ని పనులు చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. పర్యాటకులను మరింతగా ఆకట్టుకునేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే పాకాల పర్యాటకంగా మెరుగులు దిద్దుకుని జనానికి అందుబాటులోకి రానుంది.

పాకాల అందాలను వీక్షించడానికి ఆదివారాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు హైదరాబాద్, ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్ జిల్లాల నుంచి ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు వస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఏటా పాకాలకు వస్తున్న స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం పాకాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టింది. డీఎఫ్‌ఓ అనూజ్ అగర్వాల్ ప్రత్యేక దృష్టి సారించి నిధుల మంజూరీకి చొరవ తీసుకుంటుండడంతో అభివృద్ధి పనుల్లో జోరు సాగుతోంది. పర్యాటకులు పాకాలకు వచ్చి అందాలను వీక్షించే దిశగా అధికారులు ప్రత్యేక పనులు చేపడుతున్నారు. ఎఫ్‌ఆర్‌ఓ పుప్పాల రవికిరణ్ అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన నూతన ప్రణాళికలు రచిస్తూ పర్యాటకులను మరింత ఆకర్షించే దిశగా క్రియాశీలకంగా పనులు చేయిస్తున్నారు. గతంలో సీసీ రోడ్డు, చిల్డ్రన్స్ పార్కు, సీతాకోకచిలుకల పార్కు ఆధునీకరణ జరిగాయి. బోటింగ్ సౌకర్యం, బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సదుపాయాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ అనూజ్ అగర్వాల్ (ఫైల్)

నూతన పనులకు శ్రీకారం

పాకాలలో కొత్తగా సుమారు రూ.45 లక్షల అంచనా వ్యయంతో తూము వద్ద గద్దెల మరమ్మతులు, గ్రిల్స్ ఏర్పాటు, బటర్‌ఫ్లై గార్డెన్ పక్కన స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, బోటింగ్ పాయింట్ నుంచి ప్రధాన రోడ్డు వరకు సీసీ రోడ్డు, అటవీ ప్రాంతం నుంచి సఫారీ ట్రాక్, మత్తడి దాటిన తర్వాత ట్రెక్కింగ్ పాత్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు పూర్తి అయితే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరగడం ఖాయం. భవిష్యత్‌లో పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించడానికి అటవీ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. పర్యాటక రంగంలో పెద్దఎత్తున పనులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పక తప్పదు.

పర్యాటకంగా మరింత అభివృద్ధి



పాకాల పర్యాటక ప్రాంతాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో మరింతగా తీర్చిదిద్దుతున్నాం. ఉన్నతాధికారుల సహకారంతో పనులు చేపట్టాము. పర్యాటకులకు పలు రకాల వసతులు కల్పిస్తాం. గతంలో పలు పనులు చేపట్టాము. మరిన్ని పనులు చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తాం. పాకాలకు అందాలను వీక్షించి ప్రత్యేక అనుభూతి పొందేలా ప్రణాళికలు రూపొందిస్తూ కార్యాచరణ అమలు చేస్తున్నాం.

– పుప్పాల రవికిరణ్, ఎఫ్‌ఆర్‌ఓ, నర్సంపేట

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం ఇస్తున్న రంజిత్‌రెడ్డి, నాయకులు

● టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పేదలందరికీ లబ్ధి చేకూర్చే దిశగా కృతనిశ్చయంతో ఉందన్నారు. దశలవారీగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సకాలంలో ఇల్లు నిర్మించుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్, మండల కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్ రావు, సుబ్బారెడ్డి, ప్రశాంత్, శిరీష, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రద్దుతో పాలసీదారులకు లబ్ధి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం జీవిత బీమాపై జీఎస్టీ రద్దు చేయడంతో పాలసీదారులకు లబ్ధి చేకూరనుందని లియాఫీ బ్రాంచ్ అధ్యక్షుడు వల్లాల శ్రీహరి తెలిపారు. నర్సంపేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జీఎస్టీ రద్దు సంబరాలకు మేనేజర్ గోపీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడారు. జీఎస్టీ రద్దు కోసం లియాఫీ చాలా కాలంగా పోరాడుతోందని చెప్పారు. ఇక నుంచి జీఎస్టీ లేకుండానే పాలసీని వినియోగించుకోవచ్చని చెప్పారు. గతంలో 18 శాతంగా ఉన్న జీఎస్టీ పూర్తిగా రద్దు కావడంతో పాలసీదారులకు భారీగా ప్రయోజనం చేకూరనుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ వివి.సాయి, దొడ్డ కరుణాకర్ సెక్రటరీ, గౌరవ అధ్యక్షుడు గాదె మోహన్ రెడ్డి, సీనియర్ ఏజెంట్ జి.భిక్షపతి, ఎండి.హుస్సేన్, బి.సదానందచారి, రాక రాజలింగం, అంబటి సత్యనారాయణ, రాజు, రావుల రమేష్, అలసాని సోమయ్య, పలసం ఎల్లస్వామి, దుగ్గం రామ్మోహన్, నిత్యానందం, భూపతి వీరన్న, మాదారపు వీరభ్ర, ఎం.శ్రీనివాసరావు, పుట్ట సదానందం, తాటిపాముల కొమురెల్లి, గొట్టిముక్కల శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, బి.బాబు, శంకర్, ముప్పారపు జగదీశ్, మండే కుమారస్వామి, సిద్ధ శ్రీధర్, మంగా కుమార్‌స్వామి, గంధం చంద్రమౌళి, ఆడపు కోటిలింగా, డేక కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వల్లాల శ్రీహరి

దసరా ప్రశాంతంగా నిర్వహించాలి

● నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ

నల్లబెల్లి: దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నర్సంపేట రూరల్ సీఐ సాయి రమణ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో దసరా ఉత్సవాల నిర్వహణ, ఫ్లెక్సీల ఏర్పాటు, తదితర అంశాలపై ఆయన చర్చించారు. వ్యాపారుల అభిప్రాయాలు కూడా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణపై గ్రామాభివృద్ధి కమిటీ చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని చెప్పారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై గోవర్ధన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు చిట్యాల తిరుపతిరెడ్డి, బానోత్ సారంగపాణి, తడుక వినయ్, దామ సాంబయ్య, బొడిగె సమ్మయ్య, మాజీ సర్పంచ్ నానబోయిన రాజారాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సాయిరమణ

వివాహిత మృతి

సంగెం : చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని లోహితలో చోటు చేసుకుంది. వివరాలిలా.. లోహితకు చెందిన బండ కవిత (50), రవీందర్ దంపతులకు కొడుకు, ముగ్గురు కూతుర్లున్నారు. రవీందర్ మంచిర్యాలలోని సింగరేణి ఉద్యోగం చేస్తుండగా దంపతులు అక్కడే ఉంటున్నారు. ఈనెల 19న కవిత రవీందర్ లోహితకు వచ్చారు. పితృ అమావాస్య నాడు బంధువులను పిలిచే విషయంలో దంపతుల నడుమ గొడవ చోటు చేసుకుంది. మనస్తాపానికి గురైన కవిత గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా ఎంజీఎం ఆస్పత్రిలో, అనంతరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆదివారం మృతి చెందింది.

బంతితోటల రైతులను ఆదుకోవాలి

సంగెం : భారీ వర్షాల వల్ల నష్టపోయిన బంతి తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. మండలంలోని గవిచర్ల తదితర గ్రామాల్లో బంతి తోటలు సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టామని విలేకరుల ఎదుట వాపోయారు. ఈ ఏడాది భారీ వర్షాల కారణంగా దిగుబడి రాలేదన్నారు. ఎకరాకు రూ.40 వేలు పరిహారం అందించి ఆదుకోవాలని గవిచర్లకు చెందిన రైతులు మంద స్వామి, పెంతల రవి, వక్కల రాజు, పెద్దపల్లి భిక్షపతి, స్వామి, చిరంజీవి తదితరులు కోరారు.

నియామకం

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తిలో కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య సోమవారం నియమించారు. అధ్యక్షుడిగా సంకినేని గంగరాజును, ప్రధాన కార్యదర్శిగా సంకినేని జీవన్, ఉపాధ్యక్షుడుగా చిదుముల ఉప్పలయ్య, కోశాధికారి చిదుముల భిక్షపతి, కార్యదర్శిగా ఆకులపెల్లి యాకయ్య, గౌరవ అధ్యక్షునిగా మారపెల్లి ఉప్పలయ్య, ముఖ్య సలహాదారుగా కాకర్ల శ్రీనును నియమించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే నాగరాజు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, జిల్లా అధ్యక్షుడు తూల రవి ఆదేశాల మేరకు కమిటీలను నియమిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిదుముల భాస్కర్, నాయకులు చేరాలు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి



రాయపర్తి : పిడుగుపాటుకు గేదె మృతి చెందిన ఘటన మండలంలోని బంధనపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసిన సమయంలోనే 9.30 గంటల సమయంలో పిడుగు గ్రామానికి చెందిన డెక్క బొందయ్య ఇంటి ఎదుట కట్టేసిన బర్రెపై పడింది. దీంతో బర్రె అక్కడికక్కడే మృతి చెందింది. తనకు సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లిందని బొందయ్య విలపించాడు. ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరాడు.

గౌడ సంఘం కమిటీ ఎన్నిక

రాయపర్తి : మండలంలోని గట్టికల్‌లో గౌడ సంఘం గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెరుగు ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా బొనగాని యాదగిరి ఎన్నికయ్యారు. ప్రభాకర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికవడంతో ఆయన్ను కార్యవర్గం, సభ్యులు అభినందించారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన ఐత ఉప్పలయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆయన కుమార్తె అనిత పదో తరగతి నాటి మిత్రులు సోమవారం రూ.11 వేల సాయం అందజేశారు. తొలుత ఉప్పలయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు. కార్యక్రమంలో అనిత స్నేహితులు మాచర్ల పరమేశ్వర్, రాజేశ్, ఐత రాజు, ఉండాది సురేశ్, మహేశ్వరి, సాంబరాజు, విష్ణు, వీరన్న, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేట మాజీ సర్పంచ్ పోతుల ప్రభాకర్ తండ్రి ముత్తయ్య మృతి చెందగా ఆయన మృతదేహానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు జనగాం రమేశ్, మెట్టుపల్లి రమేశ్, అచ్చ నాగరాజు, పాషా, సంపత్‌గౌడ్, అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దొంగల భయంతో జనజాగారం



నందనాయక్‌తండాలో జాగారం చేస్తున్న జనం

గీసుకొండ : మండలంలోని నందనాయక్, సింగ్యతండ, విశ్వనాథపురం, తదితర లంబాడీ తండాల్లో జనానికి దొంగల భయం వీడటం లేదు. శనివారం అర్ధరాత్రి ఆ తండాల్లోని కొన్ని ఇండ్లలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన తెలిసిందే. అయితే మళ్లీ దొంగలు పడే అవకాశం ఉందన్న భావనతో జనం సోమవారం రాత్రి జాగారం చేశారు. పురుషులు, మహిళలు వేర్వేరుగా గుంపులుగా జాగారం చేశారు. దొంగలను పట్టుకోవడానికి పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నట్టు సమాచారం.

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దుగ్గొండి : నాచినపల్లి రామాలయంలో దుర్గాదేవికి పూజ చేస్తున్న భక్తులు



నెక్కొండ : అంబేడ్కర్ సెంటర్‌లో..



నల్లబెల్లి : పూజ చేస్తున్న భక్తులు

నెక్కొండ/దుగ్గొండి/నల్లబెల్లి : నెక్కొండ, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో సోమవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో శాంభవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకులు దుర్గామాత ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేశారు. దుగ్గొండి మండలంలోని నాచినపల్లిలోని రామాలయంలో, మల్లంపల్లిలో మాజీ సర్పంచ్ బైరి లలిత రమణారెడ్డి ఆధ్వర్యంలో, తొగర్రాయిలోని బొడ్రాయి సెంటర్‌లో, తిమ్మంపేట, గిర్నిబావి గ్రామాల్లోనూ దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేశారు. అలాగే నల్లబెల్లి మండల కేంద్రంలో, నారక్కపేటలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పూజలు నిర్వహించారు.

బాధిత రైతులకు పరిహారమివ్వాలి



మార్కెట్‌లో మొక్కజొన్నను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నాయకులు

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : పంట నష్టపోయిన రైతులందరికీ రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని మొక్కజొన్న పంటను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంట 50 శాతానికి పైగా దిగుబడి నష్టపోయారని తెలిపారు. మొక్కజొన్న పంట ముందుగా చేతికొచ్చినప్పటికీ ఇప్పటివరకు రూ.1951 ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే దిగుబడి తగ్గిందని, సరిపడా యూరియా అందలేదని చెప్పారు. మేడారానికి రానున్న సీఎం రేవంత్‌రెడ్డి మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల మద్దతు ధరపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బోనస్ ఇవ్వడం లేదన్నారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2400 ఉండగా రూ.1951కి మించి చెల్లించడం లేదని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 చోట్ల యూరియా కోసం రైతులు క్యూలైన్లలో నిలబడ్డారని, కాంగ్రెస్ అపరిపక్వ విధానాలతో యూరియా కోసం వృద్ధులు, మహిళలు, చంటి బిడ్డలతో రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సోమవారం ఒక్క రోజే లక్షన్నర మందికిపైగా యూరియా కోసం బారులు దీరారని చెప్పారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నా సమీక్షించడం లేదన్నారు. దిగుబడి తగ్గిన పంటలపై సర్వే చేసి బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నిపుణులతో వైద్యసేవలు

● డిప్యూటీ డెమో అనిల్‌కుమార్

గీసుకొండ : మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిపుణులతో వైద్యసేవలు అందిస్తోందని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ తెలిపారు. కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ మోహన్ సింగ్ కలిసి మండల పరిధిలోని కీర్తినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ మెడికల్ క్యాంప్‌ను సోమవారం జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి (డెమో) అనిల్‌కుమార్ పర్యవేక్షించి మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 15 రోజులపాటు నిర్దేశించిన ఆస్పత్రుల్లో వైద్యనిపుణులతో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ మోహన్ సింగ్ మాట్లాడుతూ కుష్టి నిర్ధారణ పరీక్షలను నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి చెప్పారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్, నేత్ర వైద్యనిపుణులు దేవేందర్, స్వప్న, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ గోవర్ధన్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ మొహియుద్దీన్ హుస్సేన్, ఆప్తోమెట్రిస్ట్ ఉదయ్ కిరణ్, సీఓ వైకుంఠం సిబ్బంది పాల్గొన్నారు.



ఖానాపురం : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ బిందు

ఖానాపురం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పలువురిని డాక్టర్ బిందు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, సిబ్బంది దామోదర్‌రెడ్డి, దేవిక, హేమలత, కనకలక్ష్మి, శ్రీనివాసచారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎన్‌ఎం రమాదేవి హాజరై మాట్లాడారు. చిరుధాన్యాల్లో అనేక పోషకాలుంటాయని చెప్పారు. ఆకుకూరల్లో ఐరన్, క్యాల్షియం ఎక్కువగా ఉంటాయని తెలిపారు. తల్లులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహార ప్రాధాన్యత వివరించారు. మండలంలోని జల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎం తిలక్‌కుమార్, సీసీ కట్టయ్య, అంగన్‌వాడీ టీచర్లు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు పి.విజయలక్ష్మి, బి.రజిత, రమాదేవి, కృష్ణవేణి, రజిత, ఆయాలు నీలమ్మ, కట్టమ్మ, శారద, ఆశా కార్యకర్తలు రాజమణి, లత, తదితరులు పాల్గొన్నారు.

‘అసత్య ప్రచారాలు తగదు’

పర్వతగిరి : బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లెల్లో ప్రశాంతంగా నిర్వహించుకునే బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను రాజకీయం చేస్తూ సాధారణ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. మహిళలతో అధికార పార్టీపై అసత్య ప్రచారాలు చేయిస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడం సిగ్గుచేటన్నారు. కొందరు విలేకరులు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా చెప్పుకుంటూ తమ స్వేచ్ఛకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నాడని ధ్వజమెత్తారు. సమావేశంలో ఐనవోలు ఆలయ కమిటీ డైరెక్టర్ బందెల వెంకన్న యాదవ్, సీనియర్ నాయకుడు కొమురయ్య, ఎస్టీ సెల్ నాయకుడు లక్ష్మా, తదితరులు పాల్గొన్నారు.